# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- డిజిటల్ చెల్లింపులలో భారతదేశం అగ్రగామిగా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- భారత్, చిలీ దేశాల మధ్య బలమైన బంధం కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు.
- వక్ఫ్ సవరణ బిల్లు 2025ని రేపు లోకసభలో ప్రవేశపెట్టనున్నారు.
- త్వరలో భారత్ లో పర్యటించనున్నాని సునీతా విలియమ్స్ తెలిపారు.
- రానున్న మూడు నెలలలో దేశంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

==============================

డిజిటల్ చెల్లింపుల్లో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా మార్చడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కీలక పాత్ర పోషించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ముంబైలో ఈరోజు జరిగిన RBI 90వ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ.. గత 9 దశాబ్దాలలో RBI అద్భుతమైన ప్రగతిని సాధించిందని తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అందరికీ అందుబాటులో ఉండే ఆర్థిక పర్యావరణ వ్యవస్థను తీసుకుని వచ్చిందన్నారు. నాబార్డ్, IDBI నేషనల్ హౌసింగ్ బ్యాంక్ వంటి కీలక సంస్థలను స్థాపించడం ద్వారా ఆర్థిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో RBI చేసిన కృషి ప్రశంసనీయమని రాష్ట్రపతి పేర్కొంటూ..

(వాయిస్ 29 సెకన్లు)

==============================

భారత్, చిలీ దేశాల మధ్య బలమైన బంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భారత్-చిలీ సంబంధాలను బలోపేతం చేసేలా ప్రధానమంత్రి ఈరోజు న్యూఢిల్లీలో చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ ఫాంట్‌తో చర్చలు జరిపారు. విపత్తు నిర్వహణ సాంస్కృతిక మార్పిడిలో సహకారానికి ఈ సందర్భంగా ఒప్పందాలు కుదిరాయి. లాటిన్ అమెరికాలో చిలీ భారతదేశానికి ఒక ముఖ్యమైన భాగస్వామి అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాబోయే దశాబ్దంలో సహకారాన్ని పెంపొందించడానికి అనేక కొత్త అవకాశాలను గుర్తించామని తెలిపారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, రైల్వేలు, అంతరిక్షం ఇతర రంగాలలో భారతదేశం తన సానుకూల అనుభవాన్ని చిలీతో పంచుకోవడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి మాట్లాడుతూ…

(వాయిస్ 34 సెకన్లు)

==============================

వక్ఫ్ సవరణ బిల్లు 2025ని రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో పాత్రికేయులకు వెల్లడించారు. వక్ఫ్ సవరణ బిల్లు 2025 మీద లోక్ సభలో 8 గంటల చర్చ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యుల అభిప్రాయాల మేరకు చర్చ సమయాన్ని మరింతగా పెంచవచ్చన్నారు. కాగా, బిల్లు గురించిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలియజేశారు.

==============================

ఎవరి ఆస్తులను జప్తు చేయడానికి వక్ఫ్ సవరణ బిల్లుని కేంద్ర ప్రభుత్వం తీసుకుని రావడం లేదని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. అందరికీ న్యాయం చేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. పార్లమెంటు వెలుపల ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ… వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని చెప్పారు.

(వాయిస్ 22 సెకన్లు)

==============================

రైతులకు సరసమైన ధరలకు రాయితీపై ఎరువులను అందిస్తున్నామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అందుకే ఎరువుల ధరలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన గుర్తు చేశారు. యూరియా సంచిని రైతులకు 266 రూపాయలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రికార్డు స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరిగాయని ఆయన వెల్లడించారు. వాతావరణ మార్పుల వల్ల పంటలపై కలిగే ప్రభావాన్ని తగ్గించడానికి అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రైతులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు..

విరామం

==============================

దేశంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే అన్నారు. న్యూఢిల్లీలో ఈ-స్పోర్ట్స్ కాన్ క్లేవ్ 2025ను ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… ఈ-స్పోర్ట్స్ ఒక అభివృద్ధి చెందుతున్న రంగంగా పేర్కొన్నారు. దేశంలో ఈ-స్పోర్ట్స్ ప్రాధాన్యతను గుర్తించి ప్రోత్సాహిస్తున్నామని చెప్పారు. ఈ-స్పోర్ట్స్ వేగంగా అభివృద్ధి చెందడంతో భారతదేశం సాంకేతిక రంగంలో గణనీయంగా ముందుకు సాగే అవకాశం ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాగా, క్రీడా రంగం ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

==============================

భారతదేశం ఈ రోజు ప్రాజెక్ట్ టైగర్ 52వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. 1973లో ఇదే రోజున, భారత ప్రభుత్వం దేశంలో క్షీణిస్తున్న పులుల జనాభాను రక్షించడానికి ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్ పులుల జనాభాను పెంచడంతో పాటు వాటి సహజ ఆవాసాలను కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషించింది. గత ఐదు దశాబ్దాలుగా సాగుతున్న ఈ ప్రయత్నం ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాలలో ఒకటిగా నిలిచింది. ఇదిలా ఉండగా, దేశంలో 2006లో కేవలం 1,411 పులుల సంఖ్య ఉంటే 2022 నాటికి వాటి సంఖ్య 3,682కి పెరిగింది. దేశంలో ఇప్పుడు 57 పులుల స్థావరాలు ఉండగా, అవి దాదాపు 83 వేల చదరపు కిలోమీటర్ల అటవీ భూమిలో ఉన్నాయి.

==============================

తొందరలోనే భారతదేశ పర్యటనకు రావాలనుకుంటున్నట్లుగా సునీతా విలియమ్స్ తెలిపారు. దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలో ఉన్న సునీతా విలియమ్స్ ఇటీవలే భూమి మీద సురక్షితంగా అడుగుపెట్టారు. తాజాగా నాసా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... తన తండ్రి పుట్టిన భారతదేశానికి త్వరలోనే వెళ్లాలనుకుంటున్నానని చెప్పారు. భారత్ లోని బంధువులు, ప్రజలతో ముచ్చటించాలని, వారితో తన అనుభవాలను పంచుకోవాలని ఉందన్నారు. భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్య దేశమని కొనియాడారు. అంతరిక్ష రంగంలో విజయాలు సాధిస్తున్న దేశాల జాబితాలోభారత్ నిలుస్తోందన్నారు. కాగా అంతరిక్షం నుంచి చూసినపుడు భారతదేశం చాలా అద్భుతంగా కనిపించిందని సునీతా విలియమ్స్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

==============================

బహుళ భాషల వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలలో హిందీ భాషపై జరుగుతున్న వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ... ఇటువంటి చర్చలు యువత ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యా వ్యవస్థలో తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, బెంగాలీ, మరాఠీలను చేర్చడాన్ని ప్రస్తావించారు. ఈ భాషలు జాతీయ ఐక్యతకు దోహదం చేస్తాయని, వాటిని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అన్నారు. త్రిభాషా సూత్రం దేశవ్యాప్తంగా సమగ్రతను చాటుతుందని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,414 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 1,390 పాయింట్ల నష్టంతో 76,024 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.12 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,160 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

==============================

రానున్న మూడు నెలలలో ఈ సారి సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. ఈసారి వేసవిలో ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏప్రిల్ నుండి జూన్ మధ్య అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, యూపీ, హర్యానా, బీహార్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాలులు వీచే

అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా, ఏప్రిల్ నెలలోనే దేశంలో పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు.

================================

================================